www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 27 నవంబర్ 2025
5
తిరుపతి



తెలుగుగంగ నీటి సరఫరాలో
నేడు అంతరాయం : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



తిరుపతి నగరానికి నీటి సరఫరా చేసే తెలుగు గంగ హెడ్ వాటర్ వర్క్స్ నిర్వహణ వలన గురువారం నగరంలో తెలుగుగంగ నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని నగరపాలక సంస్థ ఎన్.మౌర్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటర్ హెల్త్ నిర్వహణలో భాగంగా యం.డి. పుత్తూరు పంప్ హౌస్, మంగళం పంప్ హౌస్ ల నందు ప్రధాన వాల్వులు దెబ్బతిన్నాయి. వాటి మరమ్మత్తు పనులు చేస్తున్నారు. కావున గురువారం ఒక్క రోజు నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని, ఇందుకు ప్రజలు సహకరించాలని కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.



'సో మెనీ' ప్రమాదాలు



మంగళవారంనాటి టైల్స్ ఫ్యాక్టరీ ప్రమాదంలో మృతులు వీరే...

పోతురాజు

పాండే

- శ్రమజీవులే సమిధలు
- కానరాని భద్రతా ప్రమాణాలు
- అధికారులు మాక్‌డ్రిల్స్‌తో సరి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలు పరిశ్రమల యాజమాన్యాలు చట్టాలను ఉల్లంఘిస్తూ కార్మికుల భద్రతను ప్రమాదంలోకి నెడుతున్నాయి. తక్కువ వేతనాలకు లభిస్తున్నారనే కారణంతో.. కనీస విద్యాప్రమాణాలు, నైపుణ్య అర్హతలు లేని వలస కార్మికులను ప్రమాదకరమైన పరిశ్రమల్లో నియమిస్తున్నారు. దీంతో మానవ తప్పిదాలు, యాంత్రిక వైఫల్యాలతో వారి ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఈ బాధితుల్లో జీవనోపాధి కోసం పొట్టచేత పట్టుకుని వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న శ్రమజీవులే అధికం. కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ, కనీస వేతనాలు కల్పించకుండా వెట్టి తరహాలో ఈ పనులు చేయిస్తున్నప్పటికీ ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఏటా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సగటున 20 వరకు పరిశ్రమల్లో తీవ్ర ప్రమాదాలు జరుగుతున్నట్లు కర్మాగారాల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ ప్రమాదాల్లో కనీసం పది మంది వరకు ప్రాణాలు పోగొట్టుకోవడమో, లేక అవయవాలు కోల్పోయి దివ్యాంగులుగా మారడమో జరుగుతోంది. కొన్ని ప్రమాదాలను, మరణాలను బయటకు పొక్కకుండా యాజమాన్యాలు నొక్కి పెడుతున్న పరిస్థితీ ఉంది. యాజమాన్యాలు కనీస రక్షణ చర్యలు తీసుకోకపోవడం వల్లే ప్రమాదాలు సంభవిస్తున్నాయని కార్మిక సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. దీనికితోడు అధికారుల పర్యవేక్షణ కొరవడటం కూడా వరుస పమాదాలకు కారణాలవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తిరుపతి జిల్లాలోని సిమెంటు, స్టీల్, టైల్స్, అల్యూమినియం, టీవీలు, బ్యాటరీ తయారీ, ఫార్మా, రసాయన పరిశ్రమల్లో ఇటీవల వరుస ప్రమాదాలు చోటు చేసుకోవడం గమనార్హం.

మాక్ డ్రిల్స్ తో సరి..!!

చాలా పరిశ్రమల్లో పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టడం లేదు. ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ విభాగం అధికారులు పర్యవేక్షణ కొరవడుతోంది. ఎప్పటికప్పుడు తనిఖీ చేసి ప్రమాదాలు జరగకుండా ఏ మేరకు చర్యలు తీసుకుంటున్నారనే అంశాలు ఎవరికీ తెలియదు. ఒకవేళ ఉల్లంఘనలు ఉంటే అక్కడికక్కడే సరిచేయించడమో లేక చర్యలు తీసుకోవడమో చేయాలి. తూ తూ మంత్రంగా కర్మాగారాల వద్ద అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. తాజాగా బుధవారం టైల్స్ ఫ్యాక్టరీలో ప్రమాదం జరగడంతో, గూడూరు మండల పరిధిలోని మంగళపూర్ గ్రామ పంచాయతీలో ఉన్న కలర్‌షైన్ కోటెడ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఆంధ్రప్రదేశ్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో సిఆర్‌బిఎన్ మాక్ ఎక్సైజ్ జరుగుతుందని తహశీల్దార్ ఆర్‌వి ప్రసాద్ ఓ ప్రకటనలో ప్రకటించడం గమనార్హం.

ఈ ఏడాది జరిగిన ప్రమాదాల వివరాలు

ఈ ఏడాది జనవరిలో పెళ్లకూరు మండలం పెన్నేపల్లి వద్ద నిర్మించిన ఎమ్మెస్ అగర్వాల్ ఐరన్ పరిశ్రమ-2లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఓ బాయిలర్ పేలి 25 మందికి తీవ్ర గాయాలయ్యాయి.

- అక్టోబర్ నెలలో ఏర్పేడు మండలంలోని సీఎంఆర్ అల్యూమినియం పరిశ్రమలో గ్యాస్ పైప్ లీకేజీ వల్ల ఏర్పడ్డ అగ్ని ప్రమాదంలో ఏడుగురు కార్మికులు గాయపడ్డారు.
- ఈ ఏడాదిలోనే పుష్పిత్ స్టీల్ కర్మాగారంలో పని భారంతో ఓ కార్మికుడు మృతి చెందాడు.
- ఈసీఎల్ పరిశ్రమలో మూడు నెలల కిందట షీట్ వర్క్ చేస్తూ కింద పడి ఓ కార్మికుడు మృతి చెందాడు.
- ఏర్పేడు మండలంలోని వికతి మాల వద్ద మినుత్ బ్యాటరీ పరిశ్రమలో పేలుడు సంభవించి పలువురు కార్మికులు గాయపడ్డారు.
- డిక్సన్ టీవీల తయారీ పరిశ్రమలో అక్టోబర్ 3న ఫోర్త్ లిఫ్ట్ నుంచి ప్యాలెట్ మీద పడి ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు.
- నాయుడుపేట- మేనకూరు సెజ్ లోని అరబిందో ఫార్మా పరిశ్రమలో రెండు నెలల కిందట తొట్టెలో పడి ఓ కార్మికుడు మృతి చెందాడు.
- నాయుడుపేట- మేనకూరు సెజ్ లోని బ్రేక్స్ ఇండియా టీవీఎస్ పరిశ్రమలో అగ్నిప్రమాదం చోటు చేసుకోవడంతో ఇటీవల పలువురు కార్మికులు గాయపడ్డారు.
- తాజాగా శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని సుధా సోమెని టైల్స్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగి ఇద్దరు వలస కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయాల పాలయ్యారు.

సేఫ్టీ మెజర్మెంట్స్ పాటించాలి
అంగేరి పుల్లయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు



పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు మొదటి ప్రాధాన్యత నివ్వాలి. యాజమాన్యం సేఫ్టీ మెజర్మెంట్స్ పాటించాలి. నిబంధనలుఉల్లంఘించే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేయడమే తప్ప, ఏ పరిశ్రమ పైనా యాక్షన్ తీసుకున్న దాఖలా లేదు. పరిశ్రమాధిపతుల లాభాలవేటలో కార్మికులు సమిధలు అవుతున్నారు. ఎక్కువగా వలస కార్మికులు విగతజీవులవుతున్నారు.

నూతన లేబర్‌కోడ్స్ అమల్లోకి వస్తే...

ఆధునిక బానిసత్వమే

- కార్పొరేట్లకు ఊడిగం చేయాల్సిందే
- జిల్లాలో కార్మికసంఘాల నిరసనలు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం), యంత్రాంగం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 48 కార్మిక చట్టాలను కాలరాస్తూ నూతనంగా తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్ల వలన వచ్చేది ఆధునిక బానిసత్వమేనని, ఈ లేబర్ కోడ్ల వలన దేశంలోని 40 కోట్లకు పైగా ఉన్న కార్మిక లోకం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితులను తీసుకొచ్చిందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.జయచంద్ర, టి.సుబ్రమణ్యం, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు పి.మురళి, ఐఎఫ్‌టియు నాయకులు వెంకటరత్నం ధ్వజమెత్తారు. మహిళా కార్మిక లోకానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదన్నారు. తిరుపతి కలెక్టరేట్ వద్ద సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నూతన లేబర్‌కోడ్స్ అమలు చేయొద్దంటూ నినదించారు. వెంటనే రద్దు చేయకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు. కార్మిక నాయకులు మాట్లాడుతూ ఈ లేబర్‌కోడ్స్ వల్ల ఎనిమిది గంటల పని విధానం రద్దవుతుందని, 12 గంటలు కార్మికులకు పని చేయాల్సి ఉంటుందన్నారు. కార్మికులకు ఏదైనా సమస్య యాజమాన్యం నుంచి తలెత్తితే సమ్మె చేయడానికి 60 రోజుల ముందు నోటీసులు ఇవ్వాల్సి ఉంటుందని, అలా కాదని సమ్మెకు దిగితే ఎనిమిది రోజుల వేతనాన్ని తగ్గించేలా లేబర్‌కోడ్ ఉందన్నారు. మహిళా కార్మికులు సైతం రాత్రివేళల్లోనూ 12 గంటలు పనిచేసేలా నిర్ణయం చేశారన్నారు. లేబర్‌కోడ్ అనేది చట్టం కాదని, ఈ కోడ్‌ను అడ్డం పెట్టుకుని యాజమాన్యాలు కార్మికులపై ఇష్టానుసారంగా పెత్తనం చెలాయిస్తాయన్నారు. కార్మికుల సమస్యలను ఇన్నేళ్లుగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో యాజమాన్యాలకు, ప్రభుత్వాలకు తెలియజేసే పద్ధతి నుండి కార్మిక సంఘాలే లేకుండా చేసే కుట్రకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెరతీసిందన్నారు. కార్మికులకు ఇంత అన్యాయం జరిగే లేబర్ కోడ్ మంచిదని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు లేబర్ కోడ్ ల పర్యవసానం తెలియకుండానే అంతా బాగుంది అనేసి పండుగలు చేసుకోండని పిలుపు ఇవ్వడం దారుణం అన్నారు. దేశంలోని ట్రేడ్ యూనియన్లు, రైతు సంఘాలు లేబర్ కోడ్లను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకునే వరకు దశలవారీగా దేశవ్యాప్తంగా ఉన్న కార్మిక సంఘాలు ఐక్య పోరాటానికి సిద్ధమయ్యాయని, కార్మికుల ఆగ్రహానికి గురికాకముందే నూతన లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నిరసన కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.హేమలత, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.రామానాయుడు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి చెన్నం పెంచలయ్య, ఏఐటియుసి తిరుపతి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, సిపిఎం తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, బుజ్జి పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్ దేవేందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

- శ్రీకాళహస్తిలో... కార్మికుల ప్రాథమిక హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలంటూ సిఐటియు నాయకులు బుధవారం పట్టణ నాలుగు మాడవీధుల్లో నిరసన తెలిపారు. అఖిల భారత సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు ఈ కార్యక్రమం జరిగింది. కార్పొరేట్ల అండదండలతో జీవితకాలం అధికారంలో ఉండాలన్న కాంక్షతో మోడీ కార్మిక చట్టాలను సవరిస్తున్నాడని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య ఆరోపించారు. ఫలితంగా కార్మికులు తమ హక్కులను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్లపై వెనక్కి తగ్గకుంటే ఆందోళనలు మరింత ఉధతం చేస్తామని హెచ్చరించారు. పెనగడం గురవయ్య, గంధం మణి, వెంకటేష్, వేణు, సంక్రాంతి వెంకటయ్య, అన్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

- సత్యవేడులో తహశీల్దార్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మెలుగు రమేష్ ఆధ్వర్యంలో నిరసన జరిగింది. నూతన లేబర్‌కోడ్‌లు కార్మికుల పాలిట గుదిబండ అన్నారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా 200 రోజుల పని దినాన్ని కల్పించి 600 రూపాయల రోజువారీ కూలిగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరుణాచలం, మురళి, మునస్వామి పాల్గొన్నారు.



సత్యవేడులో..



గూడూరులో..

- గూడూరు టౌన్‌లో..టవర్‌క్లాక్ వద్ద నిరసన జరిగింది. బిజెపికి వ్యతిరేకరంగా నిలబడేటట్లయితే తక్షణం అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి, లేబర్‌కోడ్‌లను రద్దు చేస్తూ, కేరళ ప్రభుత్వంలా ఆదర్శంగా మిగిలిన ప్రభుత్వాలూ వ్యవహరించాలన్నారు. లేనిపక్షంలో కార్మికవర్గం కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, సిహెచ్ ప్రభాకర్, బివి రమణయ్య, పామంజి మణి, ఎఐటియుసి నాయకులు కె.నారాయణ, జి.రమేష్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, తిరుపతి సిటి, యంత్రాంగం



'భారత రాజ్యాంగం న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం అందిస్తోందని, అటువంటి రాజ్యాంగాన్ని గౌరవించడం, విలువలను కాపాడటం, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం మన బాధ్యత' అని వక్తలు ఉద్ఘాటించారు. రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా రాజ్యాంగాన్ని అమలు చేస్తాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ 1949, నవంబర్ 26న రాజ్యాంగాన్ని ఆమోదించినందుకు గుర్తుగా ఏటా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, మున్సిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

తుడా కార్యాలయంలో రాజ్యాంగ శిల్పి బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి పుష్పాంజలి ఘటించారు. దేశ ప్రజాస్వామ్య బలోపేతానికి ఆయన చేసిన కృషిని తుడా ఛైర్మన్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో 'సంవిధాన్ దివస్' నిర్వహించారు. ఎఎస్‌పి జె.కులశేఖర్, డిఎస్‌పిలు వి.శ్రీనివాసరెడ్డి, ఎండి షరీఫ్, ఎసిఎఫ్ జె.శ్రీనివాస్, సిఐ ఎన్.ఖాదర్‌బాష, ఆర్ఐ సాయిగిరిధర్ పాల్గొన్నారు.

రాజ్యాంగం పట్ల అవగాహన అవసరం: సిఎండి

సమాజంలోని ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. తిరుపతిలోని ఎపిఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సేవలను కొనియాడారు. సమాజంలో ప్రజలందరికీ సమానంగా సామాజిక, విద్య, ఆర్థిక పురోభివద్ధికి అవకాశాన్ని కల్పించడం వంటి అంశాలను దష్టిలో పెట్టుకుని రాజ్యాంగ రూపకల్పన జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ పి.అయూబ్‌ఖాన్, కె.గురవయ్య, కె.రామమోహన్‌రావు, జానకిరామ్, రమణాదేవి, శోభా వాలెంటీనా, పి.సురేంద్రనాయుడు పాల్గొన్నారు.



- నాయుడుపేటలో ఎఎంసి ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎస్‌కె ఫజులుల్లా ఆధ్వర్యంలో చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

- పుత్తూరు అంబేద్కర్ సర్కిల్ వద్ద ఎంఎల్ఎ ఆదిమూలం ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాల వేసి, ప్రతిజ్ఞ చేశారు. ఆదిమూలం మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగం భారత రాజ్యాంగం అని, ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ, బడుగు బలహీన వర్గాలకు హక్కులు దక్కాయని, మహిళలకు ఓటు హక్కుతో పాటు ఆస్తిలో సమాన హక్కు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ట్రస్టు భవన్ కార్యదర్శి అప్పరంజి, ట్రెజరర్ కుప్పయ్య, సబ్ రిజిస్ట్రార్ సుబ్రమణ్యం, డాక్టర్ రాజేంద్ర పాల్గొన్నారు.

- పాకాలలో కెవిపిఎస్ మండల కార్యదర్శి నరేంద్ర ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, నేటికీ కులవివక్ష కొనసాగుతూనే ఉందన్నారు. కులరహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. - బాలాయపల్లిలో ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపిడిఒ నారాయణ బిఆర్ అంబేద్కర్ చిత్రటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. డిప్యూటీ ఎంపిడిఒ రామకృష్ణ, కార్యాలయం ఎఒ వినీల్‌కుమార్ పాల్గొన్నారు. - ఓజిలిలో మండల ఎంపిడిఒ ఎం.నారాయణరెడ్డి, తహశీల్దార్ పద్మావతి, ఎంపిఎం ఎస్.పద్మమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. సిసిలు, పొదుపుసంఘాల సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు.



వేమన విజ్ఞానకేంద్రం, యుటిఎఫ్; జెవివి ఆధ్వర్యంలో పూర్వ ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తూ...

మౌలిక సూత్రాలు సామాన్యులకు తెలియాలి
పుస్తకావిష్కరణ సభలో వక్తల పిలుపు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

రాజ్యాంగాన్ని సంక్షిప్తంగా రచించి సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం హర్షించదగ్గ పరిణామమని పూర్వ ఎంఎల్‌సి బి.చెంగల్రాయులు అన్నారు. వేమన విజ్ఞాన కేంద్రంలో పూర్వ ఎంఎల్‌సి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్.లక్ష్మణరావు రచించిన భారతరాజ్యాంగాన్ని సంక్షిప్తంగా బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక పుస్తకాలను ఆవిష్కరించారు. భారత రాజ్యాంగంలో ఉన్నటువంటి మౌలిక సూత్రాలను, సంక్లిష్టమైన సమాచారాన్ని అత్యంత సులభమైన భాషలో అర్థం చేసుకోడానికి వీలుగా రచయిత స్ఫూర్తిని వక్తలు కొనియాడారు. శ్రీకాళహస్తి ఈవో టి.బాపిరెడ్డి మాట్లాడుతూ చిన్న వయస్సు నుండే భారత రాజ్యాంగం పట్ల మక్కువను పెంచుకోడానికి, భారత రాజ్యాంగంలో ఉన్న పెద్ద పెద్ద విషయాలను చిన్న చిన్న మాటలతో అవగాహన చేసుకోడానికి లక్ష్మణరావు చేసిన కృషి హర్షనీయమన్నారు. వేమన విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు ఎం నాగార్జున అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎస్ నాయుడు, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ శివన్నాయుడు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్, తిరుపతి బాలోత్సవం కార్యదర్శి నడ్డి నారాయణ, యూటీయఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల రెడ్డి తో పాటు జనవిజ్ఞాన వేదిక, యుటిఎఫ్, వివిధ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

కబ్జాదారుల నుండి చెరువులను కాపాడండి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

'తిరుపతి రూరల్ ప్రాంతంలో ఉన్న చెరువులను కబ్జాదారుల నుంచి కాపాడండి' అని సిపిఎం ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. తిరుపతి రూరల్ మండలం యోగి మల్లవరం చెరువును కాపాడాలని, వేదాంతపురంలోని రజకుల దోబీ ఘాటును ఆక్రమించుకున్న వారి పైన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. చెరువును ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. అనేకమార్లు వన్నివించినా ఫలితం లేదన్నారు.

పిల్లలతో వెట్టిచాకిరీ చేయించొద్దు

ప్రజాశక్తి - రేణిగుంట

చిన్నపిల్లలతో వెట్టిచాకిరీ చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. రేణిగుంట మండలం గురవరాజుపల్లి ఎస్.టి. కాలనీకి చెందిన ముగ్గురు పిల్లలు వెంకటాద్రి (13), మహేష్ (8), చెంచు కష్ణ (7)లను అంబేద్కర్ కాలనీకి చెందిన లోకేష్ అనే వ్యక్తి తమ వద్ద బాతుల పెంపకం పేరుతో వారి తల్లితండ్రులతో ప్రామిసరీ బాండ్లు రాయించి, వారితో వెట్టి చేయిస్తున్నారని తెలియడంతో బుధవారం సంబంధిత అధికారుల సమక్షంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వెట్టినుంచి విముక్తి కల్పించారు. ముగ్గురు పిల్లలను ఎస్టీ గురుకుల పాఠశాలలో తహశీల్దార్ సమక్షంలో పిల్లలను స్కూల్లో చేర్పించారు. లోకేష్‌ను పోలీసు స్టేషన్‌లో విచారిస్తున్నట్లు తెలిపారు.



చిన్నారులతో మాట్లాడుతున్న తహశీల్దార్

శ్రీసిటీ ప్రత్యేక అధికారులుగా జయంత్, సుగుణమ్మ

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

పరిశ్రమలకు అనుకూల వాతావరణం, 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీసిటీకి ఇద్దరు ప్రత్యేక అధికారులను నియమించింది. దీంతో పెట్టుబడిదారులకు అవసరమైన అనుమతులు, సేవలు అన్ని ఒకే చోట అందించే 'వన్-స్టాప్ అడ్మినిస్ట్రేషన్' అమల్లోకి వచ్చింది. తిరుపతిలోని జిల్లా పరిశ్రమల కేంద్రం ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారి వి. జయంత్ కుమార్‌ను శ్రీసిటీ ఫెసిలిటేషన్ ఆఫీసర్‌గా నియమించారు. పరిశ్రమల అనుమతులు, ప్రోత్సాహకాల ప్రక్రియలు, వ్యాపార సంస్కరణల అమలు వంటి కీలక సేవల కోసం ఆయన పనిచేయనున్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం శ్రీసిటీలో ఆయన ప్రత్యక్షంగా అందుబాటులో ఉంటారు. పరిశ్రమల శాఖ, శ్రీసిటీ యాజమాన్యం, కంపెనీల మధ్య ప్రధాన అనుసంధాన అధికారిగా వ్యవహరిస్తారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సకాలంలో ఫిర్యాదుల పరిష్కారం, సమన్వయంతో పాటు సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో సహకారం అందిస్తారు. పరిశ్రమలకు అవసరమైన సేవలు మరింత వేగంగా, సమర్థవంతంగా అందేలా చేస్తారు. అలాగే ఏపీ ఐ ఐ సి ప్రాజెక్టు ఇంజనీర్ (సివిల్) సుగుణను శ్రీసిటీ ఐలా అధికారిగా నియమించారు. భవన అనుమతుల ఆన్‌లైన్ ప్రాసెసింగ్, ప్రాపర్టీ టాక్స్ నిర్వహణ, వివిధ శాఖలతో సమన్వయం ద్వారా ఆన్‌లైన్ సేవల పరిష్కారం తదితర విధులను ఆమె నిర్వహిస్తారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' మార్గదర్శకాల మేరకు సేవలను పారదర్శకంగా, సమయానుకూలంగా, సమర్థవంతంగా అందించడానికి కృషి చేస్తారు.

మూడు రోజులు టోకెన్లతోనే దర్శనం

ఏడు రోజులకు మినహాయింపు
విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు
వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై బిఆర్‌నాయుడు

ప్రజాశక్తి - తిరుమల

పది రోజుల వైకుంఠ ద్వార దర్శనాలలో మూడు రోజులు మినహా, ఏడు రోజులు టోకెన్లు లేకుండా దర్శనాలకు రావచ్చని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు వెల్లడించారు. వైకుంఠ ద్వార దర్శనాల ఏర్పాట్లపై తిరుమలలోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఏడు రోజులు సామాన్య భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. డిసెంబర్ 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనం జరగనుంది. 182 గంటల్లో 164 గంటలు సామాన్య భక్తులకు దర్శనం చేయిస్తాం అన్నారురు. జనవరి 2 తేదీన నుంచి 8వ తేదీ వరకు ప్రత్యేక ప్రవేశ దర్శనం రోజుకు 15 వేలు చొప్పున జారీ చేస్తామన్నారు. రోజుకు 1000 టికెట్ల శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల జారీ చేస్తామన్నారు. డిసెంబర్ 5న ఉదయం పది గంటలకు శ్రీవాణి దర్శన కోటా, అదేరోజు మధ్యాహ్నం మూడు గంటలకు 300 దర్శన కోటా విడుదల చేస్తామన్నారు. పది రోజులు ప్రత్యేకదర్శనాలు, విఐపి బ్రేక్ దర్శనాలు, చంటిపిల్లల దర్శనాలనున రద్దు చేసినట్లు చెప్పారు. నవంబరు 27వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు మొదటి మూడు రోజులకు దర్శన టోకెన్లు బుకింగ్ చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. తిరుపతి, తిరుమల, రేణిగుంట,చంద్రగిరి స్థానికులకు రోజుకు ఐదు వేల టోకెన్లు జారీ చేయనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 10 వ తేదీ స్థానికుల దర్శన కోటా విడుదల చేస్తామన్నారు. సామాన్య భక్తులకు ఎక్కడా, ఎలాంటి ఇబ్బంది కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. టిటిడి సూచనలు పాటించి, ప్రశాంతంగా వైకుంఠ ద్వార దర్శనం చేసుకోవాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు.



పడిపూజ సందర్భంగా బుక్ లెట్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నాయుడుపేట: తిరుపతి జిల్లా, నాయుడుపేటలో భగవాన్ శ్రీ అయ్యప్ప స్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 44వ జ్యోతి పూజోత్సవ ఆహ్వాన బుక్ లెట్ ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సేవా సంఘం అధ్యక్షులు కామిరెడ్డి రాజారెడ్డి మాట్లాడుతూ నాయుడుపేటలో గత 43 ఏళ్లుగా వైభవంగా భగవాన్ శ్రీ అయ్యప్ప స్వామి జ్యోతి పూజోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 44వ జ్యోతి పూజోత్సవ కార్యక్రమం డిసెంబర్ 4,5 తేదీల్లో కేరళ తరహాలో, నిర్వహించనున్నట్లు తెలియజేశారు. రాజకీయాలకు అతీతంగా స్నేహపూర్వ వాతావరణంలో నిర్వహిస్తున్న అయ్యప్ప స్వామి జ్యోతి పూజోత్సవ కార్యక్రమానికి పట్టణ ప్రజలు, అయ్యప్ప స్వామి భక్తులు సహకరించాలని కోరారు. అలాగే వచ్చే ఏడది స్థలదాత సహకారంతో నిర్మించనున్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి ప్రజలందరూ తమకు తోచిన సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భగవాన్ శ్రీ అయ్యప్ప స్వామి సేవా సంఘం ఉపాధ్యక్షులు కనుమర్లపూడి. సుబ్రహ్మణ్యం(సురేష్), చిరువెళ్ల మునిరాజా, చిట్టేటి అంకయ్య, డి.సి.కిషోర్, కోశాధికారి, మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకట కృష్ణారెడ్డి, గౌరవ సలహా సభ్యులు చదలవాడ కుమార్, గాదిరెడ్డి గోపి, గంధవల్లి సిద్ధయ్య, చిరువెళ్ల బాబ్జి పలువురు సభ్యులు పాల్గొన్నారు.

నారాయణ గౌడ్, తిప్పారెడ్డిలకు పూలే అంబేద్కర్ అవార్డు

ప్రజాశక్తి - క్యాంపస్: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని ఏపీ భవనంలో అంబేద్కర్ పూలే ఫౌండేషన్ వారు భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ మాజీ మంత్రి పరసారత్నం, డాక్టర్ అంబేద్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల అధినేత తిప్పారెడ్డి ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్వాధ నారాయణ గౌడ్ విద్యార్థులకు సమాజానికి చేసిన సేవలను గుర్తించి అవార్డుతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నారాయణ గౌడ్ మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలో పెద్దల సమక్షంలో నన్ను ఫౌండేషన్ వారు సత్కరించడం ఆనందదాయకమని భవిష్యత్తులో సమాజానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని విద్యారంగ సమస్యల మీద పోరాటం చేస్తానని ఆదేవిధంగా నన్ను సత్కరించిన ఫౌండేషన్ సభ్యులకు, ఎస్ఎన్ఎస్ ఫౌండర్ నగేష్ కు గౌడ్ ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీహార్ మాజీ ముఖ్యమంత్రి కేంద్ర సూక్ష్మ, మధ్య, భారీ పరిశ్రమల శాఖ మంత్రి జితిన్ రామ్ మాంఝీ చేతులమీదుగా డాక్టర్ అంబేద్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల అధినేత డాక్టర్ తిప్పారెడ్డిని రాజ్యాంగ దినోత్సవం రోజు అంబేద్కర్ పూలే జాతీయ అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా తిప్పారెడ్డి మాట్లాడుతూ ఫౌండేషన్ చైర్మన్ మాజీ మంత్రి పరసారత్నం నేను సమాజానికి చేసిన సేవలను గుర్తించి జాతీయ అవార్డుతో సత్కరించడం పూర్వజన్మ సుకృతమని తెలిపారు.

మంగళంలో భారీ కొండచిలువ పట్టివేత



ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామం చాయితీ గంగాదేవి ఎన్జీ కాలనీకి ఆనుకొని ఉన్న ఇరిగేషన్ కెనెక్టివిటీ కాలువ సమీపంలో భారీ కొండ చిలువను స్థానికులు పట్టుకుని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. కాలనీకి ఆనుకుని ఉన్న కాలువ పక్కన పొదల్లో నక్కి ఉన్న కొండ చిలువను చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే కాలువ దాటి ఆ భారీ కొండ చిలువను పట్టుకొని అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి అప్పగించారు.

నిరాశ్రయులకు యూట్యూబర్ చేయూత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని తొండమనాడు శివారు ప్రాంతంలో రహదారి పక్కన ఆశ్రయం పొందుతున్న నిరాశ్రయులకు లతా రియాల్టీ యూట్యూబ్ ఛానల్ నిర్వాహకురాలు మధులత తన వంతు చేయూతను అందించారు. బుధవారం ఆ మార్గంలో వెళ్తున్న ఆమెకు చిన్న పిల్లలతో కనీస వసతులు లేకుండా దుర్భర జీవితాన్ని గడుపుతున్న కుటుంబాలు దర్శనమిచ్చాయి. వారి దీన స్థితిని చూసి చలించి పోయిన మధులత తనవంతు సాయంగా స్వెట్టర్, దుప్పట్లు ఇచ్చి, గుడారాలు ఏర్పాటు చేసుకునేందుకు టార్పాలిన్ పట్టలను పంపిణీ చేశారు. పాలక ప్రభుత్వాలు సామాజిక న్యాయం చేయకపోవడం మూలానే సమాజంలో ఇలాంటి దుర్భర జీవితాలు అనుభవిస్తున్న కుటుంబాలు ఇంకనూ చూస్తున్నామని మధులత వాపోయారు. మనసున్న దాతలు ఇలాంటి వారిని ఆదుకోవాలని పిలుపునిచ్చారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు శ్రీకారం

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండల పరిధిలోని నెల్లిపూడి పంచాయతీ ప్రజలు గత కొన్ని రోజులుగా విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతూ ఉండడంతో రైతులు, గృహ వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో (ఆర్డీ ఎస్ఎస్) రూరల్ డెవలప్మెంట్ సెక్టార్ సర్వీస్ కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా నూతన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్ల ఆధునీకరణతో పాటు 25 కే.వి ట్రాన్స్ఫార్మర్ను బుధవారం ప్రారంభించారు. దీనివలన త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా అవుతుందని విద్యుత్ శాఖ సిబ్బంది తెలిపారు. ఇకపై సమస్యలు ఉండవన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ట్రాన్స్కో ఏఈ విజయలక్ష్మి దేవి, టిడిపి నాయకులు హరీష్ నాయుడు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కలర్ ఫైన్ లో సిబిఆర్ఎన్ ఎక్స్పో

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు మండల పరిధి, మంగళపూరు గ్రామ పంచాయతీలోని కలర్ ఫైన్ కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ లో, ఆంధ్ర ప్రదేశ్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో సిబిఆర్ఎన్ మాక్ ఎక్సర్సైజ్ జరుగుతుందని ఒక ప్రకటనలో తహశీల్దార్ ఆర్.వి.ప్రసాద్ పేర్కొన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేద్దాం

ప్రజాశక్తి - రామచంద్రాపురం: ఎంపీడీవో కార్యాలయ సమావేశపు మందిరంలో బుధవారం ఎంపీపీ ఏవి బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పేద ప్రజల సంక్షేమానికి అధికారులు పనిచేయాలన్నారు. గ్రామాలలో మురికి నీటి కాలువలు శుభ్రం చేసి అంటువ్యాధులు ప్రబల కుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పక్కా గృహాలు, పింఛన్లు మంజూరు చేయాలన్నారు. జడ్పిటిసి ఢిల్లీ రాణి మాట్లాడుతూ రైతులందరికీ వ్యవసాయ శాఖ అధికారులు ఎరువులు, విత్తనాలను సక్రమంగా అందజేయాలన్నారు. వర్షాలకు గుంతలమైన ఆర్ అండ్ బి రోడ్ల మరమ్మత్తులకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మండల విద్యాశాఖ అధికారి మార్కండేయ నాయుడు మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తహశీల్దార్ మధుసూదన్ రావు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రజలు పిజిఆర్ఎస్ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు

ప్రజాశక్తి -కోట : మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని కోట తాహాశీల్దార్ కటారి జయ జయ రావు, ఎంపీడీవో దిలీప్ కుమార్ నాయక్, ఏపిఎం అనిలాలు పేర్కొన్నారు. కోట మండలంలోని స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ఏపిఎమ్ అనీలా ఆధ్వర్యంలో జెండర్ సమానత్వం కోసం పొదుపు మహిళలతో కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా స్థానిక వెలుగు కార్యాలయం నుండి కోట ఆర్ అండ్ బి రోడ్డు వరకు ర్యాలీని చేపట్టారు. మహిళల హక్కులను ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాలని వివరించారు.

శోభాయమానంగా శ్రీ పద్మావతి అమ్మవారి పుష్పయాగం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి నవాహ్నిక కార్తీక బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిసిన అనంతరం పుష్పయాగ మహోత్సవాన్ని టిటిడి బుధవారం సాయంత్రం అమ్మవారి ఆలయంలో నేత్ర పర్వంగా నిర్వహించింది.



వేడుకగా స్నపన తిరుమంజనం..

ఇందులో భాగంగా ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అమ్మవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపుతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. పుష్పయాగం సందర్భంగా టిటిడి ఉద్యానవన శాఖకు దాతలు సమర్పించిన 4 టన్నుల కుసుమాలను అమ్మవారి పుష్పయాగానికి వినియోగించారు. ఇందులో రెండు టన్నులు తమిళనాడు, ఒక టన్ను కర్ణాటక, ఒక టన్ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి దాతలు అందించారు.

మహిళా హక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, వెలుగు కార్యాలయంలో బుధవారం మండల మహిళా సమాఖ్య కార్యనిర్వాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ వెంకటరత్నమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం పురుషులతో సమానంగా మహిళలకు హక్కులు కల్పించినప్పటికీ, అవి పొందడానికి వివక్షకు గురి అవుతున్నారన్నారు. మహిళలు ఆస్తి హక్కులు వినియోగించు కోవాలి, అప్పుడే లింగ వివక్ష రూపుమాపవచ్చునని తెలియ జేశారు. ప్రతి తల్లి మగపిల్లలకు మహిళలను, బాలికలను గౌరవించడం నేర్పాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా కాపాడు కుంటామని ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని తెలియ జేశారు, ఏపియం మునెయ్య మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా తిరుగులేని శక్తిగా ఎదిగారని, దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక భూమిక పోషిస్తున్నారని తెలిపారు. అనంతరం మహిళలు మానవ హారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సీసీలు వెంకటరత్నం, జీవ, వీరజిన్న, అకౌంటెంట్ శిరీష, మండల సమాఖ్య లీడర్లు శ్వేత, భారతి, లావణ్య, మండలంలోనీ అన్ని గ్రామ సంఘాలు లీడర్లు పాల్గొనడం జరిగింది.

సింగిల్ విండో సేవలు సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సింగిల్ విండో సొసైటీ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పరమేశ్వర మంగళం సింగిల్ విండో చైర్మన్ మోహన్ రాజు పేర్కొన్నారు. పరమేశ్వర మంగళం సొసైటీ ఆవరణలో బుధవారం పుత్తూరు డీసీసీబీ మేనేజర్ కీర్తన, సూపర్వైజర్ ఢిల్లీ బాబులు రైతులకు సింగిల్ విండోలో అందే వివిధ రకాల సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీసీబీ మేనేజర్ మాట్లాడుతూ రైతాంగానికి తక్కువ వడ్డీకే స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు, బంగారంపై అందిస్తున్నామన్నారు. అనంతరం చైర్మన్ మోహన్ రాజు మాట్లాడుతూ సహకార కేంద్ర బ్యాంకుల్లో తమ ఖాతాదారులకోసం డిపాజిట్ లాకర్ అందుబాటులో ఉంటున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వరమంగళం సింగల్ విండో ఇన్చార్జి సీఈవో ఆర్ చెన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పగడాల శివ ప్రదీప్ నూతన గృహప్రవేశం



ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేటలో టీడీపీ నాయకులు, బలిజ సేవా సంఘం అధ్యక్షులు పగడాల శివ ప్రదీప్ నూతన ఇంటి గృహప్రవేశం సందర్భంగా పలువురు నాయకులు, అధికారులు గృహప్రవేశానికి హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. బలిజ సేవా సంఘాన్ని స్థాపించి సేవా స్ఫూర్తి గల మరి కొంతమందిని కలుపుకుని ఆ సంఘం పేరిట ఆపదలో ఉన్న ఎంతో మందిని స్వచ్ఛందంగా ఆదుకుంటూ వాళ్లకు ఆసరాగా నిలుస్తూ ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపడుతు నాయుడుపేట చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు, నాయకుల అభిమానాలు చూరగొంటూ పట్టణంలోని ప్రతి ఒక్కరికి సుపరిచితుడైన టిడిపి నాయకులు పగడాల శివప్రదీప్ నూతనంగా నిర్మించిన గృహానికి బుధవారం గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గృహప్రవేశంలోని పూజా కార్యక్రమానికి నాయుడుపేట పట్టణానికి చెందిన పలువురు రాజకీయ నాయకులు, అధికారులు హాజరై ఆయనకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారథి దంపతులు, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్, జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్చార్జి ఉయ్యాల ప్రవీణ్, వైయస్సార్సీపి నాయుడుపేట పట్టణ అధ్యక్షుడు కలికి మాధవరెడ్డి, హంస పృథ్వి చంద్, పొట్లపూడి రాజేష్, ఎన్సిఆర్, అట్ల కృష్ణారావు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అట్టహాసంగా నెలవల జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి - నాయుడుపేట: మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ముందస్తు జన్మదిన వేడుకలు నాయుడుపేటలోని వారి నివాసంలో టిడిపి నేత ఎస్.జె జ్యూలరీస్ అధినేత పోట్లపూడి రాజేష్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం కేక్ కట్ చేసి కార్యక్రమానికి హాజరైన వారందరికీ పంచిపెట్టారు. అనంతరం నెలవల సుబ్రహ్మణ్యం, అమృత సరళ దంపతులకు పోట్లపూడి రాజేష్ శాలువా కప్పి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పోట్లపూడి రాజేష్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం నిండు నూరేళ్లఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ఆనందంగా ఉంటూ ప్రజాసేవలను విస్తృతం చేసి ప్రజల మన్ననలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గ టిడిపి నాయకులు పార్థసారథి దంపతులు, పెళ్లకూరు మండల టిడిపి అధ్యక్షులు సంచి కృష్ణయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు గోను బాబు, ఆబోతుల బాబు పలువురు టిడిపి నాయకులు, నెలవల సుబ్రహ్మణ్యం అభిమానులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువులకు ప్రత్యామ్నాయం జీవన ఎరువులే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రసాయనిక ఎరువులకు ప్రత్యామ్నాయం జీవన ఎరువులేనని డాక్టర్ సుమతి తెలిపారు. స్థానిక పురపాలక సంఘ పరిధిలోని అమరం కండ్రిగ, నందిమంగళం గ్రామాలలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహ పరిశోధన సంచాలకులు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం తిరుపతి, జిల్లా ఏరువాక కేంద్రం చిత్తూరు ప్రిన్సిపల్ సైంటిస్ట్, కోఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణారావు, ఆర్.ఏ.ఆర్.ఎస్. శాస్త్రవేత్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

కారు, బస్సు ఢీ.. ఐదుగురికి గాయాలు



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణ సమీపంలోని పరమేశ్వర మంగళం వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. శ్రీకాళహస్తి నుండి కంచికి వెళున్న కారు, చెన్నై నుండి తిరుపతికి వెళ్తున్న తమిళనాడు (ఆర్టీసీ) బస్సును ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో పన్నీర్ సెల్వం (70), లక్ష్మి (68), రవి రాహుల్ (28), మలర్వేయి (45), కుమార్ (47)లు గాయపడ్డారు. ఎవరికీ ప్రాణాపాయం జరుగలేదని పుత్తూరు పోలీసులు తెలిపారు. స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టి గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. హైవే విస్తరణ పనులతో సూచిక బోర్డులు లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు ఆరోపించారు. సంబంధిత అధికారులు రేడియం స్టిక్కర్ ద్వారా సూచిక బోర్డు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

పోగొట్టుకున్న బంగారం అప్పగింత

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చిల్లకూరు మండల పరిధిలోని చింతవరం సిఐటియు ఆటో స్టాండ్ కార్మికుడి ఆటోలో కొత్తపాలెం గ్రామానికి చెందిన తంగారు సుబ్బమ్మ గూడూరుకు వచ్చేందుకు ఆటో ఎకింది. కానీ పక్కనే మరొక ఆటో రావడంతో ఎక్కిన ఆటో ఆలస్యం అవుతుందని భావించి ఆటో మారింది. ఆమె మొదట ఎక్కిన ఆటోలో నాలుగు సవర్ల బంగారు కడియం (నాలుగు లక్షల విలువ చేసే వస్తువు) ఉన్న సంచిని మరచిపోయి కంగారులో వేరే ఆటో ఎక్కి వెళ్లిపోయింది. అయ్యప్ప దీక్షలో ఉన్న ఆటో కార్మికుడు దారా శ్రీనివాసులు ఆ సంచిని గుర్తించి, భద్రంగా తీసుకొని గూడూరులోని మార్కెట్ స్టాండ్ దగ్గర తోటి ఆటో కార్మికులు అంకయ్య, పెంచలయ్యల సహాయంతో సుబ్బమ్మను వెతికి, గుర్తించి బంగారు కడియం ఉన్న సంచిని అందజేయడం జరిగింది. ఆటోడ్రైవర్ నిజాయితీని పలువురు ప్రశంశించారు.

ఎంపీడీవో పులిరాం సింగ్ బాధ్యతల స్వీకరణ




ప్రజాశక్తి - రామచంద్రపురం : రామచంద్రపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బి.పులిరామ్ సింగ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా, కమలాపురం నియోజకవర్గం, వీరప్పనాయనపల్లి మండల డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తూ పదోన్నతి పొంది, ఆర్సి పురం ఎంపీడీవోగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీవో పులిరామ్ సింగ్కు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి, సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, పరిపాలనాధికారి చంద్రశేఖర్ రెడ్డి, కీర్తి, రేవంత్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ను కలిసిన టిడిపి నాయకులు



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక పురపాలక సంఘం నూతన కమిషనర్ను టిడిపి నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పట్టణంలో సమస్యలు లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని కమిషనర్ను కోరారు. స్పందించిన కమిషనర్ పట్టణ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు, ఆంధ్రప్రదేశ్ మొదలియార్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్ఎన్ ధనపాల్, చిత్తూరు పార్లమెంట్ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చెంచయ్య, యూనిట్ ఇన్చార్జ్ ఈశ్వర్ యాదవ్, హేమాద్రి, ఉమా శంకర్ రెడ్డి, రజిని, మోహన, రాజకుమార్, హరి, పాల్గొన్నారు.


వైసీపీ న్యాయ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా యుగంధర్ రెడ్డి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో పార్టీ న్యాయ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తిరుపతి నియోజకవర్గానికి చెందిన పదిరి యుగంధర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ గురుమూర్తి ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం వైసీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్న నేపథ్యంలో, పార్టీ న్యాయ విభాగం బాధ్యత మరింత కీలకమైందని ఎంపీ పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలకు న్యాయ పరంగా అండగా నిలిచి, పార్టీ పరిరక్షణకు మద్దతుగా నిలవాలని యుగంధర్ రెడ్డిని ఎంపీ కోరారు.

డయాబెటిక్ ఫుట్ కేర్ చిరునామా 'టిటిసి హాస్పిటల్'

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: డయాబెటిక్ ఫుట్ కేర్కు చిరునామాగా అపెక్స్ తిరుపతి ట్రామా కేర్ సెంటర్ హాస్పిటల్ (టిటిసిహెచ్) నిలిచిందని, ప్రముఖ జనరల్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టరు సురేఖ వెల్లాల తెలిపారు. స్థానిక మంగళం రోడ్డులోని రామీ గెస్ట్ లైన్ ఎదురుగా, విశ్వనాథ్ నగర్ లోని కీర్తి హాస్పిటల్ బిల్డింగ్ ఫోర్త్ ఫ్లోర్లో నెలకొల్పిన ఆ ఆసుపత్రి వద్ద, డాక్టరు సురేఖ వెల్లాల మాట్లాడుతూ మధుమేహ రోగుల్లో జరిగే అమ్ప్యూటేషన్లలో సుమారు 85 శాతం డయాబెటిక్ అల్సర్లు కారణం అవుతాయన్నారు. డయాబెటిక్ ఫుట్ అనేది డయాబెటిస్ (షుగర్ వ్యాధి) ఉన్న వారిలో సంభవించే ఒక ఆరోగ్య సమస్య అని తెలిపారు. ఇది పాదాల్లో నరాలు దెబ్బతినడం (న్యూరోపతి), రక్తప్రసరణ సరిగ్గా జరకపోవడం వల్ల ఏర్పడుతుందన్నారు. దీని కారణంగా పాదాల్లో గాయాలు, పుండ్లు, ఇన్ఫెక్షన్లు త్వరగా మానకపోవచ్చని తెలిపారు. రక్తంలో అధిక చక్కెర స్థాయి నిల్వలు నరాలను దెబ్బతీస్తాయని తెలిపారు. దీని వల్ల పాదాల్లో స్పర్శ, అనుభూతి తగ్గిపోతుందన్నారు. ఫలితంగా గాయాలయినప్పటికీ గుర్తించకపోవడంతో ప్రమాదం పెరుగుతుందని తెలిపారు. సమస్యను త్వరగా గుర్తించడం, పాదాలను నిత్యం పరీక్షించుకోవడం ద్వారా, తీవ్రమైన సమస్యలను నివారించొచ్చని వెల్లడించారు. ఈ విషయంలో వైద్యులను సంప్రదించి, ప్రత్యేక జాగ్రత్తలు, సలహాలు తీసుకోవడం అత్యంత ముఖ్యమన్నారు. అపెక్స్ తిరుపతి ట్రామా కేర్ సెంటర్ హాస్పిటల్లో డయాబెటిక్ ఫుట్ కేర్కు అత్యాధునిక పద్ధతుల్లో నాణ్యమైన వైద్యం అందుబాటులో లభిస్తుందన్నారు. దీన్ని డయాబెటిక్ రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆ ఆసుపత్రి అధినేత ప్రముఖ ఆర్థోపెడిక్, ట్రామా కేర్ సర్జన్ డాక్టరు దుర్గా ప్రసాద్ వల్లేరి మాట్లాడుతూ టిటిడిసిహెచ్లో అన్ని రకాల ఆర్థోపెడిక్ సమస్యలకు, ట్రామా కేర్తో పాటు, ప్రత్యేకంగా ఫిడియాట్రిక్ ఆర్థోపెడిక్ చికిత్స అందుబాటులో ఉందన్నారు. ప్రతి శనివారం ఉచితంగా ఫిడియాట్రిక్ ఆర్థోపెడిక్ క్లినిక్, ఉచిత డయాబెటిక్ ఫుట్ కేర్ క్లినిక్ నిర్వహిస్తున్నామని తెలిపారు. రోగులు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7660002108, 660003108 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.



ఆర్థోపెడిక్, ట్రామా కేర్ సర్జన్ డాక్టరు దుర్గా ప్రసాద్ వల్లేరి



జనరల్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ సురేఖ వెల్లాల



ప్రత్యేకతలు...

- ప్లాస్టిక్ సర్జన్, ఆర్థోపెడిక్ సర్జన్ నుంచి ఉచిత సంప్రదింపులు.
- ప్లాంటర్ ప్రెజర్ అసెస్మెంట్.
- పాదాల రక్త సరఫరా, న్యూరోపతి పరీక్షించుట.
- సర్టిఫైడ్ ఆర్థోటెస్ట్ ద్వారా ఉచిత ఫుట్వేర్ అసెస్మెంట్.
- ఆధునాతన పద్ధతుల ద్వారా గాయాలకు చికిత్స.
- రక్తంలో షుగర్ లెవెల్స్ పరీక్షించడం.
- చేతులు, కాళ్లకు గల వైకల్యాలకు అధునాతన చికిత్స
- పుట్టుకతో వచ్చే వైఫల్యాలు, కాళ్ల పొడగింపు చేయుట.
- పుటుకతో వచ్చిన వంకర పాదము (క్లబ్ ఫుట్).
- చిన్న పిల్లలు, పెద్దవాళ్లలో తుంటి సమస్యలకు చికిత్స.
- గ్రోత్ మాడ్యులేషన్.
- పసిపిల్లల్లో దొడ్డికాళ్లు, వంకర కాల్లుకు చికిత్స.
- చిన్న పిల్లల్లో పాదము వైకల్యాలు, విరిగిన ఎముకలకు అత్యాధునిక చికిత్స
- మెదడు పక్షవాతం వల్లవచ్చిన వైకల్యంకు నాణ్యమైన చికిత్స.

బాలయ్య ప్రథమ వర్ధంతికి హాజరైన వైఎస్ఆర్సిపి నాయకులు




ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చి నాయుడు కండగ మండలంలో బుధ వారం బందుల బాలయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా వర్దయపాళ్యం మండలం కంచరపాలెంలో జరిగిన కార్యక్రమానికి వైయస్సార్సీపీ ముఖ్య నాయకులు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి, తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, సత్యవేడు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్లు హాజరయ్యారు. మండల అధ్యక్షుడు కె.మణి నాయుడు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి ఉగ్గుముడి గురునాథం, జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల గోపాల్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు రాకేష్, విభాగ కార్యదర్శి రవేంద్ర రెడ్డి, అనుబంధం విభాగాల నాయకులు అజయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టును తక్షణమే పూర్తి చేయాలి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి బైరాగి పట్టెడ పద్మావతి పార్కు వద్ద అర్ధాంతరంగా నిలిపివేసిన కల్వర్టు నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. బుధవారం బైరాగి పట్టెడ కల్వర్టు వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ వందల మంది ప్రజలకు అసౌకర్యంగా కల్వర్టు పేరుతో రోడ్డును తవ్వి అర్ధాంతరంగా నిలిపివేయడంతో అనేకమంది వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు. కల్వర్టు నిర్మాణం చేపట్టి నెల రోజులు పైబడి కావస్తున్న పూర్తి చేయకపోవడం కాంట్రాక్ట్ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అన్నారు. కాంట్రాక్టర్పై మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కమిషనర్ తక్షణమే స్పందించి, ఆ కల్వర్టును పరిశీలించాలని ప్రతిఘటన పూర్తి చేయించడానికి చర్యలు చేపట్టాలని కోరారు. లేని పక్షంలో రాజకీయాలకి అతీతంగా అన్ని వర్గాల ప్రజలను సమీకరించి మున్సిపల్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, ఉదయ్ కుమార్, బండి చలపతి, నగర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ రాజ్యాంగ దినోత్సవం



ప్రజాశక్తి - పాకాల: పాకాల మండలం, మొగరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి బాబ్జి ముఖ్య అతిథిగా విచ్చేశారు. రాజ్యాంగ నిర్మాతల కృషిని స్మరించుకుంటూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు అతిథులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమలత నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వనపర్తి వెంకట సిద్దులు, విమలా విక్టోరియా, సుల్తాన్, బాబు, నీరజ, రామమూర్తి , సిఆర్పీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాకాల బాలుర కళాశాలలో ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ హరినాధ ఆచారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, విద్యార్థుల చేత ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హరినాధాచారి మాట్లాడుతూ అంబేద్కర్ ఏర్పాటు చేసిన రాజ్యాంగం సమతా భావాన్ని నెలకొల్పేందుకు దోహదం చేసిందన్నారు. బాలుర కళాశాల నుంచి స్థానిక అంబేద్కర్ భవనం వరకు ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించి, విద్యార్థుల ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పాఠశాల విద్యార్థులు మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో మంచి రాజకీయ నాయకులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు శ్రీహరి, రోజా రమణి ప్రణాళిక బద్ధంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య, మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, ముని సుబ్రహ్మణ్యం, పాఠశాల చైర్మన్ లక్ష్మి, వైస్ చైర్మన్ చెంగయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. రాజ్యాంగం దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో సాంఘీక శాస్త్రం ఉపాధ్యాయులు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్ చార్జి ప్రధానోపాధ్యాయులు సురేష్ బాబు, ఉపాధ్యాయులు యువశ్రీ మురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యాస్ వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో..



తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలం, విద్యాస్ వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో కరెస్పాండంట్ విద్యాప్రకాష్ రెడ్డి అధ్యక్షతన ప్రిన్సిపాల్ మేరీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు.

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: మాదిగ దళ పోరాట సమితి(యండిపిఎస్) నాయకుల ఆధ్వర్యంలో చిన్నగొట్టిగల్లులో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాదిగ దళ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పెద్దపల్లి శేఖర్ ఆదేశాల మేరకు మండలంలో ఎండిపిఎస్ నాయకుల ఆధ్వర్యంలో మండల కమిటీ ద్వారా రోడ్డు వెంకటరమణను నూతనంగా ఎన్నుకోవడం జరిగింది. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎండిపిఎస్ తిరుపతి జిల్లా అధ్యక్షులు తేనేపల్లి గురుశంకర ప్రసాద్, తిరుపతి జిల్లా ఇన్చార్జి సుండుపల్లి రవి మాదిగ, చిత్తూరు ఉమ్మడి ఇన్చార్జి ఏలూరు పురుషోత్తం, తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు ఆదినారాయణ, తిరుపతి జిల్లా అధ్యక్షులు ఆర్ పరంధామయ్య, అధ్యక్షులు రోడ్డు వెంకటరమణ మాదిగదల పోరాట సమితి మండల సీనియర్ నాయకులు పెద్ద ద్వారక కృష్ణయ్య, చిన్న ద్వారక ఎర్రావారిపాలెం మండల నాయకులు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: కారిపాకం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు దుష్యంత్ రెడ్డి అధ్యక్షతన, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు చినబాబు, దేవీరాజీల ఆధ్వర్యంలో విద్యార్థులతో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరమణ, వెంకటేశ్వర్లు, మోతీలాల్, మునెమ్మ, ఏడుకొండలు చినబాబు, దేవీరాజీ మేడమ్, కుమార్, మనోహర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -కోట : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం శ్రీ చైతన్య పాఠశాల ఏజీఎం శ్రీకాంత్, ఆర్ఐ శ్రీనివాసులు ఆదేశాల మేరకు కోట శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో స్కూల్ నుండి కోట క్రాస్‌రోడ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రిన్సిపాల్ చిరంజీవి, జోనల్ డీన్ శివయ్య, ప్రైమరీ ఇన్‌చార్జ్ హరిత, ప్రీ-ప్రైమరీ ఇన్‌చార్జ్ వినీల, సహ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వాకాడు : వాకాడు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో సాయి ప్రసాద్, తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి, ప్రతిజ్ఞ చేశారు.

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఓటేరులో స్వాతంత్ర సమరయోధులు రామకృష్ణరావు జ్ఞాపకార్థం స్థాపించిన బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద గ్రామస్తులు అందరూ కలిసి బుధవారం ఘనంగా నివాళులు అర్పించారు. ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక జిల్లా అధ్యక్షుడు సూర్య కిరణ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రత్యేకతలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓటేరు గ్రామ కమిటీ చైర్మన్ ఇస్మాయిల్ భాయ్, టిడిపి గ్రామపంచాయతీ అధ్యక్షుడు మోహన్, యూనిట్ ఇంచార్జ్ సుదర్శన్, రంగయ్య, విశ్వనాథ్, సిద్ధారెడ్డి, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: భారత రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా చల్లప్ప మేస్త్రి మెమోరియల్ మెమోరియల్ అంబేద్కర్ భవన్ మేనేజ్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అబేద్కర్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ భవన్ కమిటీ చైర్మన్ డాక్టర్ పరవశివం, అంబేద్కర్ భవన్ సెక్రెటరీ నాగేశ్వరరావు, సెక్రెటరీ నాగేశ్వరరావు, ట్రెజరర్ మురళి, సమతా సైనిక్ దళ్ చైర్మన్ చిరంజీవి, కమిటీ సభ్యులు రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బాలాయపల్లి : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నారాయణ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రామకృష్ణ, కార్యలయం ఏవో వినీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం రాజ్యాంగ దినోత్సవం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మండల విద్యాశాఖ అధికారులు లలిత కుమారి, భాస్కర్ బాబు స్థానిక శ్రీ పద్మావతి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ముఖ్య అతిథులుగా పాల్గొని, రాజ్యాంగ ప్రవేశికను ప్రతిజ్ఞ రూపంలో చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం లీగల్ సపోర్ట్ సెంటర్, న్యాయశాఖ విభాగం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపకులపతి ఆచార్య ఉమ వెన్నం మాట్లాడుతూ న్యాయ విద్యార్థినులుగా రాజ్యాంగ విలువలను పాటించాలని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సమాజంలో న్యాయస్థాపనకు పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో తిరుపతి మూడవ అదనపుజిల్లా జడ్జీ ఎం. గురునాథ్, పదవ అదనపు జిల్లా జడ్జీ రామచంద్రుడు, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజనీ, డీన్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ హ్యూమానిటీస్ పీ.ఎం.ఉష, కోఆర్డినేటర్ ఆచార్య సి.వాణి న్యాయశాఖ విభాగాధిపతి ఆచార్య టి. సీతాకుమారి, విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): సమాజంలో ప్రజలందరూ స్వేచ్ఛ, సమానత్వాలతో సమన్యాయాన్ని పొందుతూ బ్రతకాలని ఎంతో దూర దృష్టితో ఆకాంక్షించి రాజ్యాంగ నిర్మాణాన్ని చేసిన గొప్ప వ్యక్తి డాక్టర్ బి.ఆర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తిరుపతి నగర పరిధిలోని ఆయన నివాసంలో ఎంపీ మద్దెల గురుమూర్తి, దళిత సీనియర్ నేత మల్లారపు మధు ఇతరులతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఈ సమావేశంలో గిరిజన సంఘ నేత బి. మునీంద్ర నాయక్, నాగేంద్ర, డాక్టర్ మస్తానమ్మ, హేమచంద్రారెడ్డి, హరీష్, నాగయ్య పాల్గొన్నారు.

'రైతన్నా... మీ కోసం'

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: రైతుల అభ్యున్నతికి సీఎం పంచ సూత్రాలను అమలు చేస్తున్నారని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం డక్కిలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

మండలం తీర్థంపాడులో నిర్వహించిన 'రైతన్నా.. మీ కోసం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను రైతులకు వివరించారు. తెలుగుగంగ నీరు పుష్కలంగా లభిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో వెంకటగిరి నియోజకవర్గం వ్యవసాయోత్పత్తిలో రాష్ట్రంలో గుర్తింపు పొందేలా కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో వరి సాగు అధికంగా ఉండటంతో యూరియా లభ్యతపై ప్రభుత్వాన్ని అప్రమత్తం చేశామని తెలిపారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని తెలిపారు. 'అన్నదాత సుఖీభవ' కింద సంవత్సరానికి రూ 20,000 చొప్పున రైతులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని గుర్తు చేశారు. ఆల్తూరుపాడు రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి సీఎంతో మాట్లాడి త్వరలోనే ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని చెప్పారు. డిమాండ్ ఆధారిత పంటలు, ప్రకృతి వ్యవసాయం, టెక్నాలజీ అనుసంధానం వంటి అంశాలపై రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. పౌల్ట్రీ రంగంలో రాష్ట్రం దేశంలో ముందంజలో ఉందని, త్వరలో మెరుగైన పౌల్ట్రీ పాలసీ (2025-2030) ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి పశువులకు నీటి తొట్టెల నిర్మాణం, గోకులాల ఏర్పాటు, పశుగ్రాసాల పెంపకం వంటి పథకాలు కూని ప్రభుత్వం రైతులకోసం అందుబాటులోకి తీసుకు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడు మండలం, సీతారాంపేట పంచాయతీలో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి రైతులతో బుధవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి రైతులకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించాఉరు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు, ఎమ్మార్వో భార్గవి, సౌభాగ్యమ్మ, సీనియర్ నాయకులు మైనారు పున్నారావు, టిడిపి కార్యకర్తలు మరియు అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి పరిధిలోని చిన్న రామాపురం గ్రామంలో బుధవారం రైతన్న మీకోసం కార్యక్రమం మండల ఉద్యానవన అధికారిణి ఎస్ శైలజ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా ఉద్యాన అధికారి దశరథ రామి రెడ్డి హాజరయ్యారు. ప్రభుత్వం రైతుల కోసం చేస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి మరియు ఉద్యాన శాఖలో అమలవుతున్న వివిధ పథకాల గురించి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిన్న రామాపురం గ్రామ ఉద్యాన సహాయకురాలు రాణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా తలకోన అభివృద్ధి



ప్రజాశక్తి - యర్రావారిపాలెం: శ్రీ తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం ధర్మకర్తల మండలి సమావేశం చైర్మన్ సోమనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాన అజెండాగా తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయాన్ని మరింత ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చి దిద్దడానికి ముందడుగు వేస్తున్నామని చైర్మన్ పేర్కొన్నారు. ఆలయ పరిసర ప్రాంతంలో యాత్రికులు మద్యం, మాంసం సేవించకుండా ప్రైవేట్ హోటల్లో ఎటువంటి మాంసాహారం తయారు చేయకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆలయం లోపల ప్లాస్టిక్ బాటిల్స్ వాడకుండా నిషేధించి ఆలయాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని నిర్ణయించారు. ఆలయ అభివృద్ధి కోసం ఆదాయాన్ని బట్టి ఖర్చు వివరాలు ప్రతినెల తెలియజేస్తామని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు రాజన్న, సిరివెళ్ల రమేష్, శశికళ, రాజేశ్వరి, ఇందిరా, శోభ, చలపతి, ఈశ్వరయ్య, ఎక్స్ అఫ్సియో మెంబర్ సత్య ప్రసాద్ శర్మ, ఈవో రవీందర్ రాజు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయంలో బుధవారం పాలక మండలి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపులో 68 రోజులకు గాను రూ. 4,15,363 ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ తిరుపతి ఇన్స్పెక్టర్ పణిరాజశయన ఒక ప్రకటనలో తెలిపారు. అన్నదానం హుండీ ద్వారా రూ. 45,872 ఆదాయం వచ్చిందన్నారు.

మీడియా ప్రతినిధులపై ఆర్డీఓ ఆగ్రహం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: తిరుపతి ఆర్డిఓ కార్యాలయంలో బుధవారం చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ బూతుల పెంపు, మార్పుపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డిఓ రామ్మోహన్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరుకావాలని రాజకీయ పార్టీ నాయకులు, మీడియా ప్రతినిధులకు సమాచారం అందించారు. ఈ సమావేశం కవరేజ్ కోసం వెళ్ళిన మీడియాపై తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియాను ఎవరు రమ్మన్నారంటూ ప్రశ్నించారు. రాజకీయ నాయకులు సమాచారంతో సమావేశానికి వచ్చామని మీడియా ప్రతినిధులు సమాధానమిచ్చినా, పట్టించుకోని ఆర్డీవో మీడియా ప్రతినిధులు బయటకు వెళ్లాలంటూ ఆదేశించారు. ఆర్డీవో తీరుపై కంగుతున్న మీడియా ప్రతినిధులు సమావేశం మధ్యలోనే బయటకు వచ్చేశారు. మీడియా ప్రతినిధులకు కనీసం గౌరవం కూడా ఇవ్వని ఆర్డీవో తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

దివ్యాంగులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: డిసెంబర్ 3న జరగనున్న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా, దివ్యాంగ క్రీడాకారుల కోసం జిల్లా స్థాయి క్రీడా పోటీలు జిల్లా క్రీడా సాధికార సంస్థ ఆద్వర్యంలో నిర్వహించబడతాయని జిల్లా క్రీడాధికారి శశధర్ తెలిపారు. ఈ పోటీలను తిరుపతి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తిరుపతి ఎస్.వి. యూనివర్సిటీ స్టేడియంలో నిర్వహించనున్నారన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులకు 1. బ్యాట్మెంటన్ (బాలురు, బాలికలు) 2. చెస్, 3. అథ్లెటిక్స్ 100 మీటర్లు, 200 మీటర్లు, లాంగ్ జంప్, షాట్ పుట్, 4.వాలీబాల్ పోటీలు నిర్వ హించనున్నామని శశిధర్ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.